బ్రిడ్జిపై పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జిపై బైకులు

తాళ్లూరు:

మండలంలోని తూర్పుగంగవరం నుంచి మండల కేంద్రం తాళ్లూరు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గాన పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న చెరువు వంక బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. మండలంలో దాదాపు పది గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మార్గానే బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తుంటారు. అందులో మరీ ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వెళ్తున్నా ఎవరికి వారు తమ కెందుకులే అనుకుంటున్నారు తప్ప పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రోడ్డు వెంబడి పిచ్చి మొక్కలు, కాలువలో చెత్తాచెదారం అధికంగా ఉండటంతో మురుగు చేరి బ్రిడ్జికు ఉన్న రంధ్రాలు మూసుకుపోయాయి. దీంతో మురుగు నీరు బ్రిడ్జిపై నుంచి పారుతూ దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి–ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు ఉండటంతో వర్షం నీరు చేరి కారు, ఆటోల డోములకు రోడ్డు తగిలి వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. పక్కనే మద్యం దుకాణం ఉండటంతో మద్యం తాగి అధిక వేగంతో వాహనదారులు వెళ్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని ఆ పక్కనే ఉన్న కొత్తపాలెం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెడల్పు లేని బ్రిడ్జితో వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు.

ఆ బ్రిడ్జి ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది:
బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. తాళ్లూరు మండల వాసులు అధిక సంఖ్యలో ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జిపై గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. ఇది వర్షాకాలం కావడంతో నీరు రోడ్డుపై పారుతోంది. వెంటనే అధికారులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మించాలి.



లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, తాళ్లూరు



కోటయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

కోటయ్య కుటుంబానికి ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ

కురిచేడు: మండలంలోని వెంగాయిపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు మానం కోటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం కోటయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కోటయ్య కుమారుడు వెంకటేశ్వరరావును మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కోటయ్య కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ఈయన వెంట జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, బయ్యవరం సర్పంచ్ మాలేపాటి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ వింగ్ అధ్యక్షుడు వీరగంధం కోటయ్య, పార్టీ ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు సారెడ్డి నాగిరెడ్డి, అంకె గోపాల కృష్ణ, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పోకూరి వెంకట సుబ్బారావు, ప్రచార కమిటీ అధ్యక్షుడు ఇందూరి సుబ్బారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్ కుమార్, నాయకులు నుసుం ప్రతాప్‌రెడ్డి, ఎన్వీ నాగిరెడ్డి, ఊట్ల పోలయ్య, వై.కోటేశ్వరరావు, ఊట్ల ఆంజనేయులు, మన్నం అశోక్, పి. గోవింద్, మానం ఆంజనేయులు, సీహెచ్ చిరంజీవి, ఎం.బాలగురవయ్య, ఎల్.పాపారావు, ఆలా పెద్ద గోవింద్, ఊట్ల శివ, యాగంటి బాలకృష్ణ, కాశీం, జి.వెంకట్రావు, పోకూరి కోటయ్య, ఎల్.పాపయ్య, మానం వెంకటేశ్వర్లు ఉన్నారు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

- పలు దుకాణాల్లో ఎరువులు, విత్తనాల అమ్మకాలు నిలుపుదల

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. దాడుల్లో డీలర్ల స్టాక్ నిల్వలు సరిగా లేనందున సుమారు రూ.10 లక్షల విలువ చేసే 35 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అపర్ణ, తహసీల్దార్ పాల్, అనిత, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు: ఖరీఫ్ సీజన్లో రైతులు అధికంగా పంట సాగు చేస్తున్నారని, అన్ని ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎస్సై ఎస్.మల్లికార్జున్‌రావు సూచించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాల యజమానులతో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, ఎరువుల విషయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు, కానిస్టేబుళ్లు దారా బ్రహ్మనాయుడు, బాబూరావు, వాసు, దుకాణ యాజమానులు ఉన్నారు.

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: స్థానిక ఎస్టీ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో ఇందిర గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులతో రాయడం, చదవడం నేర్పించాలని చెప్పారు. ప్రతి విద్యార్థి రాసిన నోట్‌బుక్‌లను ఉపాధ్యాయులు తనిఖీ చేసి పలు సూచనలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వ మెనూను అనుసరించి విద్యార్థులకు రుచికర భోజనం వడ్డించాలని చెప్పారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యం

తాళ్లూరు: ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ఎస్.సత్యం అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామ సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించి బాధ్యతగా విధులు నిర్వహించాలని, ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న వివిధ సర్వేలు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర ఆంధ్రతోనే సంపూర్ణ అక్షరాస్యత



పుస్తకాలు విడుదల చేస్తున్న అధికారులు

దర్శి: అక్షర ఆంధ్రతోనే సంపూర్ణ అక్షరాస్యత సాధ్యం అవుతుందని మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి అన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉల్లాస్ అక్షరాంధ్ర ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏపీఎం రజియా బేగం అధ్యక్షతన శివరాజనగర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యం కలిగిన అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించి భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమ నిర్వహణ కోసం వివిధ గ్రామాల్లో ఎంపిక చేసిన వలంటరీ టీచర్లకు మండల స్థాయిలో ఒక రోజు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ ద్వారా ప్రభుత్వం అందించిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి, మెప్మా సీఎంఎం రఘు, వయోజన విద్య పర్యవేక్షకుడు చౌడిరెడ్డి, సీసీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

7న రక్తదాన శిబిరం

గిద్దలూరు రూరల్: భగవాన్ సత్యసాయి జయంతి సందర్భంగా పట్టణంలోని రేడియో బావి సమీపంలో గల సత్యసాయి మందిరం ఆవరణలో ఈ నెల 7వ తేదీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సమితి మండల కన్వీనర్ ఎస్.అనంతరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాతలు ముందుకు రావాలని కోరారు.

చంద్రబాబుకు ఓటేస్తే..మోసం గ్యారెంటీ



దర్శి: పెద్ద ఉయ్యాలవాడలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: చంద్రబాబుకు ఓటేస్తే మోసపోవడం గ్యారెంటీ..అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పెద్ద ఉయ్యాలవాడ, రాజంపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు, ఎన్నికల తర్వాత వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసాలను బట్టబయలు చేస్తూ క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డులు ఆవిష్కరించారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 143 హామీల్లో ఇచ్చిన సూపర్ సిక్స్‌కే దిక్కు లేకుండా పోయిందన్నారు. గ్రామాల్లో మహిళలు తమకు నెలకు రూ.1500 ఎప్పుడు ఇస్తారా..అని సంవత్సరంన్నర నుంచి ఎదురు చూస్తున్నారన్నారు. నిరుద్యోగులు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారా..అని ఎదురురు చూస్తునారని చెప్పారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి రాష్ట్రంలో నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపానపోలేదన్నారు. ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు సృష్టించిన సంపద, తెస్తున్న అప్పులు డబ్బంతా ఎటు వెళ్లిపోతోందని ప్రశ్నించారు. దేశంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు మొదటి స్థానంలో ఉన్నారన్నారు. పాలన అంటే మాట తప్పని మడమ తిప్పని నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేవీరెడ్డి, విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ దుగ్గిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ అమీన్‌బాషా ,గ్రామ సర్పంచ్ మురళి, నాయకులు శ్రీను, కౌన్సిలర్, నియోజకవర్గ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు తుళ్లూరి బాబూరావు, బత్తినేని వెంకటేశ్వర్లు, బాబు, శ్రీను పాల్గొన్నారు.

దొనకొండ (కురిచేడు): చంద్రబాబుకు మోసాలు చేయడంలో ఆస్కార్ అవార్డు ఇవ్వవచ్చని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దొనకొండ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం దొనకొండ మండలం రుద్రసముద్రం, మంగినపూడి పంచాయతీల్లోని చిలకలపల్లి గ్రామాల్లో ×బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున కృష్ణారెడ్డితో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు సూపర్ సిక్స్‌తోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వివరించారు. గతేడాది రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకపోగా పండించిన పంట కనీసం అమ్ముకోలేక ఇప్పటికీ కొందరు రైతులు కందులు, పొగాకు ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారని, మిర్చి కోల్డ్‌స్టోరేజీల్లో మగ్గిపోతోందని చెప్పారు. ఇప్పటికైనా కూటమి నాయకులు దౌర్జన్యాలు, అక్రమ కేసులు, మోసాలు పక్కనపెట్టి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. బూత్ కమిటీ అధ్యక్షుడు కాలూరి రమణయ్య, జిల్లా యాక్టివిటీ సభ్యుడు బత్తుల వెంకట సుబ్బయ్య, షేక్ రసూల్, ఎంపీటీసీ ఈరెళ్ల చిన్న అల్లూరమ్మ, మాజీ సర్పంచ్ ఈరెళ్ల చిన్న వెంగయ్య, సొసైటీ డైరెక్టర్ పులిచెర్ల వెంకటేశ్వర్లు, వి. వీరాచారి, కోటి, ఐనోలు వెంకటేశ్వర్లు, నాలి వెంకటేశ్వర్లు, మిందాల ఆంజనేయులు, చెన్నెబోయిన చిన్న వెంకటేశ్వర్లు, బచ్చలకూర మరియదాసు, చెన్నెబోయిన గురవయ్య, లాగా నాసరయ్య, నాలి కాశయ్య, నాలి పెద్దిరాజు, దుగ్గెంపూడి నాగయ్య, వేగినాటి మాస్, నాలి రాజయ్య, పెలిమిద్ది నారాయణ, గోనా కోటయ్య, గోనా కాశయ్య, చిలక భూషణం, బచ్చలకూర కాశయ్య, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.శివారెడ్డి, ఎస్.అచ్చయ్య పాల్గొన్నారు.



దొనకొండ: రుద్రసముద్రంలో..

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు

దర్శి: మండలంలోని పోతవరం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుకు ఎంపికైన పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మందపల్లి సుబ్బారావు మాట్లాడుతూ తమ పాఠశాల ఉపాధ్యాయునికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, వీరాంజనేయులు, మధుబాబు పాల్గొన్నారు .

కార్యకర్తలకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ



వైఎస్సార్ సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని క్రిస్టియన్ పాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త రావి నూతల చిన్న కోటయ్య, కాలు ఆపరేషన్ చేయించుకున్న గర్నెపూడి జొంతానులను దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల మరణించిన గర్నెపూడి విద్యసాగర్ కుటుంబాన్ని పరామర్శించి మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అన్నీ విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు మృతి

- సంతాపం తెలిపిన ఎమ్మెల్యే తాటిపర్తి



వలీ సాహెబ్ (ఫైల్)

యర్రగొండపాలెం: స్థానికంగా ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న షేక్ వలీసాహెబ్(50) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. రెండు రోజులుగా ఆయన అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నాడు. అనుకోకుండా గుండెపోటుకు గురైన ఆయన్ను తొలుత ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిలో ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు చదువుకుంటున్నాడు. సీనియర్ జర్నలిస్ట్ వలీసాహెబ్ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాసులు



ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన మండ్ల శ్రీనివాసులు



సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా చిన్నదోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మండ్ల శ్రీనువాసులు ఎంపికయ్యారు. ఆయన్ను పలువురు అభినందనలతో ముంచెత్తారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చే అవార్డుకు ఎంపికై నందుకు మండల పరిధిలోని చిన్నదోర్నాల, నల్లగుంట్లలతో పాటు యర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని శివరాజనగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు మిఠాయిలు పంచి పెట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



వినాయక నగర్‌లో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

పెద్దదోర్నాల: మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు 9వ రోజుల పాటు పూజలు అందుకున్న అనంతరం నిమజ్జనానిని గురువారం తరలి వెళ్లాయి. వివిధ ప్రాంతాల్లో ఆదిదేవునికి తమ విఘ్నాలు తొలగి శుభాలు చేకూరాలంటూ భక్తులు తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. గురువారం మండల కేంద్రంలోని గణపతి నగర్, సాయిబాబాగుడి, నాయీ బ్రహ్మణ వీధి, ఎగువ చర్లోపల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేకంగా పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. ఆయా విగ్రహాల వద్ద భక్తులు భారీగా అన్నదానం చేశారు. సాయిబాబా ఆలయంలో గణపతి లడ్డూను వేలం పాటలో నుసుళ్లపల్లి రవి రూ.40 వేలకు దక్కించుకోవటం విశేషం.